ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు జిల్లా వార్తలు

5

గురువారం 28 మార్చి 2024



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 41.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:25 (గురు)
సహరి : 4:40 (శుక్ర)

సూపర్ సిక్స్‌తో ఎంతో మేలు



రాష్ట్రాన్ని మింగేసిన వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

- టీడీపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం
- పేద ప్రజలకు ఈ పథకాలే ఆలంబన
- మహిళల సంక్షేమానికి మరింత అండ
- పార్టీ కేడర్‌కు అంతా అండగా ఉంటాం
- నిజం గెలవాలి యాత్రలో నారా భువనేశ్వరి

ఏలూరు/టి.నరసాపురం/తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/ నిడమర్రు/ నూజివీడు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పేదల సంక్షేమానికి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు తెలుగుదేశం సూపర్ సిక్స్ పేరిట అభివృద్ధి బాటలు వేస్తుంది. ఇదెంతో మీకు మేలు చేస్తుంది. పేదరిక నిర్మూలనకు దోహదపడుతుంది' అని నారా భువనేశ్వరి అన్నారు. ఉమ్మడి పశ్చిమలో రెండో రోజు బుధవారం 'నిజం గెలవాలి' పేరిట పర్యటించి బాధిత టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. చింతలపూడిలోని 'కె' కన్వెన్షన్ నుంచి ఉదయం బయలుదేరారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో చనిపోయిన టి.నరసాపురం మక్కినవారిగూడెంలో అబ్బుదాసరి కృష్ణ, తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో తాడేపల్లి శేఖర్, పెంటపాడు మండలం పడమరవిప్పర్రులో కోడి అప్పారావు, నిడమర్రులో గొర్రెల సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆమె పార్టీ మీ కుటుంబాల అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెళ్లిన అన్నిచోట్లా పార్టీ కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు, మరికొందరు తమంతట తాముగా పరిచయం చేసుకున్నారు. ఆయా ప్రాంతాల పరిస్థితులు, పార్టీ కుటుంబాల స్థితిగతులను భువనేశ్వరి ఆరాతీశారు. పలుచోట్ల కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. 'వచ్చే ఎన్నికలు చాలా కీలకం. రాష్ట్ర భవిష్యత్‌కు అద్దం పడతాయి. దీన్ని కురుక్షేత్రంగా భావించి ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి. వైసీపీ సర్కార్ రాష్ట్రాన్ని అన్ని విధాలా మింగేసి ప్రజా జీవితాన్ని సర్వనాశనం చేసింది. ఒకప్పుడు ఎంతో శాంతిగా ఉండే రాష్ట్రంలో ఇప్పుడు టన్నులకొద్దీ గంజాయి రవాణా అవుతోందని, విశాఖ పోర్టుకు 25 వేల కిలోల మాదక ద్రవ్యాలు దిగుమతి అవ్వడం తాజా ప్రమాదస్థాయిని తెలియచేసింది. ప్రతి కుటుంబానికి తండ్రి ఎంత అవసరమో, రాష్ట్రానికి ఇప్పుడు సమర్థుడైన నాయకుడు అంత అవసరం. ప్రజల కష్ట సుఖాలలో పాలు పంచుకునేందుకే బయటకు రావాల్సి వచ్చింది. సూపర్‌సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలే జరుగు తుంది. మహిళలకు మరింత సంక్షేమం, ఊతం ఈ పథకాల ద్వారా అందుతాయి. చంద్రబాబు సీఎంగా వున్నప్పుడు హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారు. ఈ కారణం గా అక్కడ ఉద్యోగాలకు కొదవ లేదు. విభజన తర్వాత పారిశ్రా మికవేత్తలు కేవలం చంద్రబాబు మీద ఉన్న నమ్మకంతో పెట్టుబడులతో తరలివచ్చారు. నిరుద్యోగత తగ్గించేందుకు ప్రయత్నించారు. కానీ ఇప్పుడా పరిస్థితి ఎక్కడైనా కనిపిస్తుందా ? లేదు. చంద్రబాబు అంటే తెలియని భారతీయుడు ఉండరు. అంతలా రాష్ట్రగౌరవాన్ని పెంపొందించారు. చంద్ర బాబు నేతృత్వంలోనే మరింత అభివృద్ధికి సరికొత్త బాటలు వేయడానికి వీలుపడుతుంది' అని అన్నారు.

నేడు నూజివీడులో పర్యటన

భువనేశ్వరి గురువారం నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని బెజవాడ రామారావు, ఆగిరిపల్లిలో కలవకొల్లు శ్రీరాములమ్మ, పలగాని చంద్రయ్య కుటుంబ సభ్యులను, నూజివీడు మండలం గొల్లపల్లిలో వెనిగళ్ళ పూర్ణచంద్రరావు కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం గుడివాడ నియోజకవర్గానికి వెళతారు.







టి.నరసాపురం మక్కినవారిగూడెం, నిడమర్రు, తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో బాధితులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి, చిత్రంలో బొరగం, వలవల తదితరులు



భువనేశ్వరికి ఆడపడుచు లాంఛనం అందజేస్తున్న బొలిశెట్టి కుటుంబ సభ్యులు

ఆడపడుచు లాంఛనాలు

తాడేపల్లిగూడెం కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, అనురాధ దంపతులతోపాటు కోడలు శ్రీదేవిప్రియ పసుపు కుంకుమ, చీరతో ఆడపడచు లాంఛనం అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్ తన సతీమణితో కలిసి హారతులు ఇచ్చి భువనేశ్వరికి గుమ్మడికాయలతో దిష్టి తీశారు. పెంటపాడులో మండల టీడీపీ అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, పూలు చల్లుతూ, హారతులతో స్వాగతం పలికారు. పడమరవిప్పర్రులో భువనేశ్వరిని చూసేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. అప్పన్నవీడు అభయాంజనేయస్వామిని దర్శించుకుని కృష్ణా జిల్లా బిల్లనపల్లి వెళ్లారు. ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్, తణుకు, తాడేపల్లిగూడెం, పోలవరం, ఉంగుటూరు, చింతలపూడి అభ్యరులు ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు వలవల బాబ్జి, బొరగం శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, గన్నిన సురేంద్రనాథ్‌చౌదరి, శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తి, నల్లూరి వెంకట చలపతి రావు, ఆచంట సూర్యనారాయణ, పరిమి రవికుమార్, వాడపల్లి వెంకటసుబ్బరాజు, సత్యనారాయణ, కిలపర్తి వెంకట్రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షుణ్ణంగా తనిఖీలు : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 27 : జిల్లా వ్యాప్తంగా అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లాల ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి, సారా, మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో వచ్చినప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా 31 ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీమ్‌లు తిరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలతో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో కవాత్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ముందుగా సువిధ యాప్ ద్వారా సభలు, సమావేశాలకు, ర్యాలీలకు అనుమతులను పొందాలని సూచించారు.

బీఎస్పీ అభ్యర్థులు వీరే..

ఏలూరు టూటౌన్, మార్చి 27: బహుజన సమాజ్ పార్టీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ప్రొఫెసర్ ఎస్‌పీడీ పాల్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి ఏలూరు బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ప్రకటించారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎ.రతన్‌కాంత్, చింతలపూడి-ఎల్‌వీ. చైతన్య, దెందులూరు-రమేష్‌బాబు, ఉంగుటూరు-బుంగా ఏసు, కైకలూరు-నాగేశ్వరరావు, నూజివీడు- డాక్టర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, పోలవరం-ఎస్.వెంకటేశ్వరరావు పోటీ చేస్తారన్నారు.

పోలవరం న్యూ డెమోక్రసీ అభ్యర్థిగా రామ్మోహన్

బుట్టాయగూడెం, మార్చి 27 : పోలవరం నుంచి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థిగా సరియం రామ్మోహన్ పోటీ చేయనున్నట్లు వాడపల్లి కాలనీలో బుధవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు ధర్మాల సురేష్ తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ : కలెక్టర్

ఏలూరుసిటీ, మార్చి 27: ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు అనుసరించి జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ విధిస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ప్రజలు లైసెన్స్ కలిగిన ఆయుధాలు వారి వెంట తీసుకెళ్లడం, ప్రదర్శించడం నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ఫలితాల ప్రకటన తేదీ వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు.

నలుగురు వలంటీర్ల తొలగింపు

చింతలపూడి, మార్చి 27: చింతలపూడి నియోజకవర్గంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నలుగురు వలంటీర్లను సస్పెండ్ చేసి తొలగించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య తెలిపారు. చింతలపూడి నగరపంచాయతీ బట్టువారిగూడెంలో వైసీపీ అభ్యర్థి కంభం విజయ్ రాజు ఎన్నికల ప్రచారంలో తనగాల రవిచంద్ర, తనగాల సోని, ఉలవలపూడి అనూష, కె.అనిత అనే నలుగురు వలంటీర్లు ప్రచారంలో పాల్గొన్నారని దీనిపై విచారించి ఎన్నికల కోడ్ ఉల్లంగించినందుకు వారిని సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతితో ఆఫీసర్



స్వేచ్ఛగా ఓటు వేయాలి..

చింతలపూడి ఆర్‌వో అద్దయ్య

- చింతలపూడి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 25 సెక్టార్‌లలో అధికారులను నియమించాం. సరిహద్దు చెక్ పోస్టులు రెండు, ఇంటర్నల్ చెక్ పోస్టులు రెండు ఏర్పాటుచేసి ఎనిమిది టీమ్‌లను నియమించాం. మూడు వీడియో సర్వేలెన్స్ మూడు టీమ్‌లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ఆరు టీమ్‌లు ఏర్పాటు చేశాం.
- నియోజకవర్గం మొత్తం ఓటర్లు 2,71,502. వీరిలో పురుషులు 1,33,747, మహిళలు 1,37,714, నాన్ జెండర్స్ 41 మంది ఉన్నారు. వీరికోసం 273 పోలింగ్‌కేంద్రాలు, 162 లొకేషన్స్ ఏర్పాటు చేసి పరిశీలించాం. ఇందులో 132 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. కొత్త ఓటర్లు 17,241మందికి ఓటర్ కార్డులు అందించారు.
- ఫిర్యాదుల కోసం చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. 088-23223111 లేదా సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. హెల్ప్ డెస్క్ మీడియా మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేశాం. 80 ఏళ్ల దాటిన వృద్ధ ఓటర్లు, దివ్యాంగులు 347 మంది ఉన్నారు. వీరు ఫారం -12 ద్వారా దరఖాస్తు చేసి ఓటు వినియోగించుకోవచ్చు.
- కోడ్ అమలులోకి వచ్చాక ఇప్పటివరకు చెక్‌పోస్టుల తనిఖీలో రూ.3,80,000 నగదు, రూ.4,72,000 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నాం. కోడ్ ఉల్లంఘన కింద నలుగురు వలంటీర్లను, ఒక ఉపాధ్యా యుడిని సస్పెండ్ చేశాం.

- చింతలపూడి


పొలిటికల్ హీట్

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఓ వైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు టిక్కెట్లు దక్కని నేతల భవిష్యత్ ప్రణాళికపై రాజకీయంగా హీట్ పెరుగుతోంది. మరోవైపు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తవడంతో గెలుపు గుర్రాలు వీధులకెక్కాయి. ప్రచార బాట పట్టాయి. నువ్వా నేనా తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నాయి. ప్రధాన పక్షాల నడుమ హోరాహోరీ ప్రచారం మరికొద్ది రోజుల్లో ఊపందుకోబోతోంది.

ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్‌లో వున్న కైకలూరు స్థానం నుంచి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను బీజేపీ తన అభ్యర్థిగా ప్రకటించింది. చాలా కాలంగా డాక్టర్ శ్రీనివాస్ ఈ నియోజకవర్గంలో అన్ని వర్గాలతో ముఖా ముఖి భేటీ అవుతూ వస్తున్నారు. మధ్యలో ఈ స్థానం నుంచి కొందరి పేర్లు వినిపించినా తాజాగా బీజేపీ అభ్యర్థుల జాబితాలో కామినేనికే చోటు లభించడంతో ఇప్పటి వరకు సాగిన ఊహాగా నాలకు తెరపడింది. నరసాపురం, ఏలూరు పార్లమెంట్ స్థానా లకు, వాటి పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు కూటమి అభ్యర్థులు అభ్యర్థులు ఖరారవడంతో ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి కూటమి నుంచి పోటీ చేసే వారంతా రాజకీయాల్లో దాదాపు ఆరితేరినవారే. ఒకటికి రెండుసార్లు ఎన్నికల బరిలో నిల్చున్న వారే. ఆయా సామాజిక వర్గాలను ఆకర్షించేందుకు, తగిన విధంగా వ్యూహాలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ముఖాముఖి భేటీలతో క్షణం తీరికలేకుండా ఉన్నారు. గడపగడపకు వెళ్లి ప్రజాశీర్వాదం కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈలోపు అన్ని నియోజకవర్గాల్లోనూ, అన్ని పార్టీల్లోనూ చేరికలు జోరుగా సాగుతున్నాయి. నిన్న మొన్నటి దాకా ఏ పార్టీలోనూ సభ్యత్వం లేనివారు తాము ఫలానా పార్టీ నుంచి ఇంకో ఫలానా పార్టీలో చేరుతున్నట్లు ప్రతిరోజు ఆయా నియోజకవర్గ అభ్యర్థుల సమక్షంలోనే హడావుడి చేస్తున్నారు.

రఘురామ... ఏం చేయబోతున్నారు



నరసాపురం సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు భవితవ్యంపైనే అందరినోటా నానే ప్రశ్న. కొన్నాళ్లుగా వైసీపీని ఏకిపారేసి, సీఎం జగన్‌కు కంట్లో నలుసైన రఘురామకు ఇప్పటి వరకు ఏ పార్టీలోనూ సీటు దక్కలేదు. రాజకీయ పరిణామాల క్రమంలో ఇదంతా చోటు చేసుకుంది. ఇప్పటికే మిత్రపక్షాల కూటమి పక్షాన అభ్యర్థులను ప్రకటిం చారు. అయితే ఆయన జరిగిన రాజకీయ పరిణామాల్లో ఏ మాత్రం వెనకడుగు వేయకుండా తాను ఈ ఎన్నికల కురుక్షేత్రంలో పోటీ చేయడం ఖాయమనే దిశగా ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే నరసాపురం ఎంపీ స్థానం నుంచి బీజేపీ తన అభ్యర్థిగా శ్రీనివాసవర్మను ప్రకటించింది. రఘురామకు అవకాశం జారిందని తెలిసిన వెంటనే అన్ని పార్టీల్లోనూ ఆయన వున్న అభిమానులు షాక్‌కు గురయ్యారు. ఏదో రూపంలో ఆయన పోటీ చేసే అవకాశం కల్పించాలన్నదే మెజారిటీ వాదన. ఈ క్రమంలో ఆయన నేడు భీమవరం రానున్నారు. తన సన్నిహితులు, రాజకీయ ఆప్తులు, అభిమానులతో భేటీ అవుతారు. ఆయనను కలవడానికి పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారు. తన మనసులోని మాటను వీరికి వివరించే అవకాశం లేకపోలేదు. ఆయన రాకతో అందరి దృష్టి భీమవరం వైపు తిరిగింది.

నేడు భీమవరానికి సిట్టింగ్ ఎంపీ రఘురామ రాక

ముఖ్యులు, అభిమానులతో భేటీ.. ఏం జరుగుతుందోనని సర్వత్రా ఉత్కంఠ

- మెత్తబడిన మాజీ ఎంపీ మాగంటి.. నెలాఖరున చంద్రబాబుతో భేటీ
- భవిష్యత్‌పై చౌదరి తపన.. అయినవారితో సుదీర్ఘ మంతనాలు

తపన చౌదరి రూటెటు ?



ఏలూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి సిద్ధపడి చివరి క్షణంలో అవకాశం దక్కక ఆగ్రహించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి తన భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తారా, పార్టీ నిర్ణయానికి లోబడి సైలెంట్‌గా ఉండిపోతారా.. అనే ప్రశ్నలు అన్ని పక్షాలలోనూ చర్చకు దారితీస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం ఎంపీ స్థానం కాకపోతే ఎమ్మెల్యే స్థానం నుంచి అవకాశం ఇచ్చి ఆయనను పోటీకి దింపుతారని అంతా భావించారు. తపన చౌదరి ఎక్కడ నిలబడినా గెలుపు ఖాయమనే విస్తృత ప్రచారం సాగింది. ఈలోపే నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాల పరిధిలో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి ఉమ్మడి అభ్యర్థుల జాబితా పూర్తయింది. కైకలూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా కామినేనిని ప్రకటించారు. ఒకానొక దశలో ఈ స్థానం నుంచి చౌదరిని దింపుతారని ప్రచారం సాగింది. ఇప్పుడు అది కూడా చేజారింది. ఈ నేపథ్యంలో తపన చౌదరిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఆయన అనుకూలురు పెద్ద ఎత్తున ఒత్తిడి చేస్తున్నారు. పోటీకి వీలుగానే ఆయన అనుచరులంతా హడావుడి ఆరంభించారు. ఒకటి రెండ్రోజుల్లోనే తన భవిష్యత్‌పై ఆయన కీలక నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

మెత్తబడ్డ మాగంటి



అసంతృప్తితో వున్న టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబును బుజ్జగించేందుకు తెలుగుదేశం చేసిన ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చాయి. ఆయనతో సీనియర్ నేతలు మాట్లాడి ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీకి మీరెంతో అవసరమని చెప్పారు. కొన్ని విషయాల్లో ఒత్తిళ్లను అధిగమించి, పార్టీని ముందుకు నడిపించడంతోపాటు పొత్తు ధర్మాన్ని ఆచరించడంలో టీడీపీ నాయకత్వం తలమునకలై వుండగా, సీనియర్లుగా వున్న తామంతా పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిందిగా బాబుకు వివరించి చెప్పారు. నెలాఖరున పార్టీ అధినేత చంద్రబాబుతో మాగంటి ముఖాముఖి ఉండేలా పార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'వ్యక్తిగత పనుల మీద ఉన్నాను. నాకెలాంటి ఇబ్బందులు లేవు.' అంటూ మాగంటి బాబు సోషల్ మీడియాలో స్పందించారు. ఆయనతో నేరుగా భేటీ అయ్యేందుకు నియోజకవర్గానికి చెందిన కొందరు ప్రయత్నిస్తున్నారు.



కామినేనిని అభినందిస్తున్న ముస్లింలు, అభిమానులు

కైకలూరుకు కామినేని

బీజేపీ అభ్యర్థిగా బరిలోకి.. అభిమానుల సంబరాలు

కైకలూరు, మార్చి 27 : కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గా నికి కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ఎంపిక చేయడంతో మూడు పార్టీల నాయకులు బాణసంచా కాల్చి, మిఠాయిలను పంచుతూ కేక్ కట్ చేసి కామినేనికి అభినందనలు తెలిపారు. ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, పీజేఎస్ మాల్యాద్రి, ఎండీ జానీ, ఉస్మాన్, సయ్యద్ బాషీద్, రామకృష్ణ, పి.రాధాకృష్ణ, గంగుల శ్రీదేవి, జనసేన పార్టీ నాయకులు కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టర్ నుంచి మంత్రిగా..

కైకలూరు మండలం వరహాపట్నంలో పుట్టి పెరిగిన ఆయన ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య వృత్తిని చేపట్టారు. ఆయన తల్లిదండ్రులు రాజేశ్వరమ్మ, విజయసింహ భార్య మనోరమ, కుమారులు డాక్టర్ విజయ్‌గోపాల్‌తిలక్, వేణుగోపాల్ తిలక్, విమల్ కుమార్ విదేశాల్లో స్థిరపడ్డారు. ఎన్టీఆర్‌పై అభిమానంతో టీడీపీలో చేరారు. అనతికాలంలోనే ఎమ్మెల్సీగా పదవి వరించింది. 30 ఏళ్లపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేపల రైతుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం తరపున కైకలూరు నుంచి పోటీ చేసి 972 స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడితో ఆయనకున్న సత్సంబంధాలతో 2014లో బీజేపీలో చేరి టీడీపీ-బీజేపీ పొత్తులో కైకలూరు నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాంప్రసాద్‌పై 21,570 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉమ్మడి ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేశారు. ఐదేళ్ల కాలంలో రూ.730 కోట్లతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశారు.

ఉచిత అడ్మిషన్లపై మరోసారి డైలమా



ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటూనే అమ్మఒడి డబ్బులు కట్టుకోవాలనడంపై ఆగ్రహం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 27 : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద జిల్లాలోని ప్రైవేట్,అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన భర్తీ చేసేందుకు విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకునే గడువు తేదీని ఈ నెల 31వ తేదీవరకు పొడిగించినట్టు సమగ్ర శిక్ష ఏపీసీ బి.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందు పర్చినట్టు వివరించారు.

అమ్మఒడి డబ్బులు కట్టాల్సిందేనా..?



ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఒకటో తరగతి సీట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన ఏలూరు జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరానికి మొత్తం 83 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 75 మందే ఆయా పాఠశాలల్లో చేరారు.ఈ విద్యార్థులకు ఫీజుని ప్రభుత్వమే ప్రైవేటు పాఠశాలలకు చెల్లిస్తుందని అందరూ భావించారు. దీనికి భిన్నంగా ఇటీవల ప్రభుత్వం పంపిన ఓ సర్క్యులర్‌తో సంబంధిత బాలల తల్లితండ్రులు అవాక్కయ్యారు. ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు అమ్మఒడి నగదు బదిలీ పథకం కింద ఒకొక్కరికి జమచేసిన రూ.13 వేల నుంచి ప్రైవేటు పాఠశాలలకు ఫీజు చెల్లించుకోవాలని స్పష్టం చేయడంతో ఒక్కసారిగా నోరెళ్ళ బెట్టారు. ముందుగానే ఈ విషయాన్ని ప్రభుత్వం స్పష్టత ఇచ్చి ఉంటే తాము ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించుకునేవారమని, ఇంతోటి దానికి ఉచిత విద్య అంటూ ప్రభుత్వ బిల్డప్ దేనికంటూ పేరెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత విద్యఅంటూ ఒకటో తరగతిలోకి ప్రవేశించి ప్రస్తుతం రెండో తరగతి చదువుకూడా ముగియనున్న దశలో గడిచిపోయిన విద్యా సంవత్సరం ఫీజుని ఇపుడు తల్లిదండ్రులే చెల్లించుకోవాలంటూ షరతుపెట్టడం సరైంది కాదంటూ ప్రభుత్వ చర్యలను తప్పుబట్టిన విషయం విదితమే. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కుటుంబానికి ఒకరు వంతున అమ్మఒడి డబ్బులివ్వగా, ప్రైవేటు పాఠశాలల్లో పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాల పిల్లలకు ఉచిత విద్యఅంటూ ఊదరగొట్టి రెండేళ్ళ తర్వాత ఇపుడు అమ్మఒడి పథకం డబ్బులను చెల్లించుకోవాల్సి రావడం జగన్ ప్రభుత్వానికి పేదలపట్ల ఎంతప్రేమ ఉందో తెలియజేస్తోందని పలువురు తల్లితండ్రులు మండిపడుతున్నారు. ఇపుడు రెండోతరగతి చదువుతున్న పిల్లల తల్లితండ్రుల నుంచి ఒకటో తరగతికి సంబంధించిన ఫీజుని జిల్లాలో 75 మంది నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేశారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి వచ్చిన సంకేతాలతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లితండ్రుల నుంచి వసూలు చేసుకునేలా సమగ్రశిక్ష జిల్లాకార్యాలయం ద్వారా క్షేత్రస్థాయిలో ఎంఈవోలు పేరెంట్స్‌పై ఒత్తిడి తెచ్చిమరీ పని పూర్తిచేయడానికి తమవంతు సహకారం అందించారు. ఈ క్రమంలో తమకు అమ్మఒడి డబ్బులు ఇచ్చినట్టు ఇచ్చి మళ్ళీ ప్రభుత్వమే లాగేసుకున్నట్టయిందని తల్లితండ్రులు వాపోతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2023-24) ఉచిత అడ్మిషన్ల కింద జిల్లాలో ఒకటో తరగతిలో 1018 మంది బాలలు ప్రవేశాలు పొందగా అమ్మఒడి డబ్బులను ఇంకా విడుదల చేయనందున, వీరితో పాటు ప్రస్తుతం రెండోతరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఫీజు వసూలుపై ఇంతవరకు స్పష్టత లేదు. మరోవైపు తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఫీజుపై స్పష్టతకు సమగ్రశిక్ష జిల్లాకార్యాలయ వర్గాలను వివరణ కోరగా తమకు కూడా క్లారిటీ లేదని వివరించాయి.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



రితికుమారిని సత్కరిస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 27: విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని వాల్‌మార్ట్ గ్లోబల్ టెక్నాలజీస్ సాఫ్ట్ వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ (బెంగుళూరు) రితికుమారి అన్నారు. ఏపీ నిట్‌లోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అసోసియేషన్ సహకారంతో స్పీక్ ఎక్స్‌ప్లోరింగ్ ద ఎస్‌డీఈ ట్రెండ్స్ అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీల్లో ఇంటర్న్ షిప్ చేయడం వల్ల సాంకేతిక నైపుణ్యాలు పెరగడంతో పాటూ విద్యార్థుల ఆలోచనా విధానం కూడా మెరుగు పడుతుందన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్నాయని, అటువంటి వాటిపై పట్టు సాధించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంరం రితికుమారిని ఆచార్యులు మెమోంటోతో సత్కరించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు, ఆచార్యులు డాక్టర్ కార్తికేయశేషాద్రి, డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ ప్రభావతి, సీఎస్ఈ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ అఖిలేష్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ సీఐ సతీష్‌కు సిల్వర్ మెడల్



పాలకొల్లు రూరల్, మార్చి 27 : పాలకొల్లు రూరల్ సీఐ కుడిపూడి సతీష్ రాష్ట్ర డీజీపీ డెస్క్ సిల్వర్ మెడల్ అవార్డుకు ఎంపికయ్యారు. డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రతీ ఏటా సిబ్బందిలోని శక్తి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తూ అవార్డులను అందిస్తున్నారు. అవార్డుకు ఎంపికైన సతీష్‌ను పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

సీబీఐ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శోభన లక్ష్మి



పాలకొల్లు, మార్చి 27 :న్యాయవాది పోలిశెట్టి శోభనలక్ష్మీ సీబీఐ కోర్టు (విజయ వాడ) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. గతంలో హైదరాబాద్ సీబీఐ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, పాలకొల్లు కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, ఫుడ్ కార్పోరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా వివిధ బాధ్యతలను నిర్వహించారు.

ఏప్రిల్ 1న నన్నయలో బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం, మార్చి 27 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాలలో బీఈడీలో ప్రవేశాలకు ఏప్రిల్ 1వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ బుధవారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కాల వ్యవధి గల కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి, అర్హత గల వారు హాజరు కావాలన్నారు. రెగ్యులర్ సీట్లు 14, ఈడబ్ల్యూఎస్ 5 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బీఈడీ ఎడ్‌సెట్ 2023 ప్రవేశపరీక్షకు హాజరై ఉండాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు కోరే విద్యార్థులు ఏప్రిల్ 1 ఉదయం 9 గంటలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్లు డి.జ్యోతిర్మయి 70930 08473 నెంబరు లేదా యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాను పట్టివేత

తణుకు, మార్చి 27: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమా చారంతో బుధవారం ఉదయం పట్టణ పోలీసులు ఎన్టీఆర్ పార్కు వద్ద పట్టు కున్నారు. వ్యాన్‌ను పట్టణ పోలీసు స్టేషనుకు తరలించి రెవెన్యూ అధికా రులకు సమాచారం అందించారు. అధికారులు వ్యాన్‌లో ఉన్న బియ్యం నమూ నాలు సేకరించి, రేషన్ బియ్యం కాదా అనేది నిర్ధారణ కోసం జిల్లా పౌర సర పరాల శాఖ కార్యాలయానికి పంపిస్తున్నట్లు డీటీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

పెదవేగి, మార్చి 27 : పెదవేగి మండలం విజయరాయి దగ్గర బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్టు పెదవేగి ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయరాయి గ్రామానికి చెందిన ఉయ్యాల వెంకటేశ్వరరావు ద్విచక్రవాహనంపై బలివే వెళ్ళి తిరిగి వస్తుండగా విజయరాయి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వరరావు(68) అక్కడికక్కడే మృతి చెందాడు.


27-03-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	241	235	239.32
	జంగారెడ్డిగూడెం-1	240	235	239.55
	జంగారెడ్డిగూడెం-2	241	235	239.73
	కొయ్యలగూడెం	240	235	239.37
	గోపాలపురం	241	235	238.63

ఇక మున్సిపల్ పాఠశాలలపై 'మ్యాపింగ్' కత్తి !

ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలోనే టీచర్లకు 'మిగులు' భయం?

ఇప్పటికే హేతుబద్ధీకరణతో జడ్పీ పాఠశాలలు కుదేలు





ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 27 : జిల్లా పరిషత్/ప్రభుత్వ పాఠశాలలను, ఉపాధ్యాయులను ఇప్పటికే తీవ్రంగా ప్రభావితం చేసిన జీవోలు 117, 121 ఉత్తర్వుల ప్రధానాంశాలు తాజాగా మున్సిపల్ పాఠశాలలను కుదిపి వేయనున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా వున్న మున్సిపల్ పాఠశాలల్లో హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం హడావుడిగా ప్రొసీడింగ్స్ ఆదేశాలను జిల్లా విద్యాశాఖకు పంపడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఒకింత అలజడి నెలకొంది. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా మున్సిపల్ పాఠశాలల రేషనలైజేషన్ ఎలా చెల్లుబాటవుతుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ సూచనలకనుగుణంగా ఉమ్మడి జిల్లా డేటాను సేకరించే కసరత్తును విద్యాశాఖ ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో ఏలూరు కార్పోరేషన్, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, నిడదవోలు, కొవ్వూరు, నర్సాపురం మున్సిపాల్టీలున్నాయి. ఇప్పటికే జడ్పీ/గవర్నమెంట్ యాజమాన్య పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో 1, 2, 3 తరగతులను ఒక కిలోమీటరు దూరంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియను ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తుండగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటన ప్రభుత్వానికి ఎదురైన విషయం తెలిసిందే. ఈ మేరకు రేషనలైజేషన్ ప్రక్రియను అమలు చేయడం వల్ల పెద్దసంఖ్యలోనే ప్రభుత్వ పాఠశాలలు మూతపడటమో లేదా విలీన పాఠశాలలు దూరాభారం కావడం వల్ల బాలబాలికల సంఖ్య గణనీయంగా పడిపోవడమో జరిగాయి. హేతు బద్ధీకరణ వల్ల పాఠశాలల కుదింపు జరగడంతో పాటు టీచర్లు రోజువారీ బోధించే పిరియడ్ల సంఖ్య దాదాపు 50 శాతం పెరిగిపోవడంతో తమపై మోయలేని పనిబారం పడిందంటూ ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వ చర్యలను బాహాటంగానే వ్యతిరేకించాయి. వీటన్నింటినీ ఖాతరు చేయని ప్రభుత్వం ఇపుడు రేషనలైజేషన్‌ను మున్సిపల్ పాఠశాలలకు కూడా విస్తరిం చాలని నిర్ణయించడం ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళనకు కారణమవుతోంది.

పెద్దసంఖ్యలోనే 'మిగులు' ఉపాధ్యాయులు

ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్య పరిధిలో 44 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాల లున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం ఒక్క ఏలూరు కార్పోరేషన్ పాఠశాలల్లోనే హేతుబద్ధీకరణ అనంతరం సుమారు 125 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 20-25 మంది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ (మిగులు) టీచర్లు ఉంటారని అంచనా. అధికారిక మదింపు అనంతరం ఈ సంఖ్యల్లో కొద్దిపాటి మార్పులు ఉండ వచ్చు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని మిగతా పురపాలక సంఘాల్లో కూడా తలెత్తవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఇంతకుముందు మున్సిపల్ పాఠశాలల నిర్వహణ అధికారాలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో ఉండేవి. ఇటీవల ఈ అధికారాలను పంచాయతీరాజ్ /ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ చూసే పాఠశాల విద్యాశాఖకు బదలాయించారు. తాజాగా హేతుబద్ధీకరణ ప్రక్రియను చేపట్టిన కార్పోరేషన్/మున్సిపల్ పాఠశాలల్లో సర్‌ప్లస్ టీచర్లను జిల్లా యూనిట్‌గా ఇతర మున్సిపాల్టీల్లో కొరత వున్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారన్న ప్రచారం ఒకటి జరుగుతోంది. కాగా ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా గుర్తించిన టీచర్లను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాలంటే ఉమ్మడి జిల్లాలో మరో మున్సిపల్ కార్పోరేషన్ లేకపోవడంతో సాంకేతికపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. తొలుత రేషనలైజేషన్‌ను పూర్తిచేసి పాఠశాలల మ్యాపింగ్, మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు జూన్ నుంచి ప్రారంభమయ్యే నూతన విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చేలా నిర్ణయం తీసుకునే అవకాశా లున్నాయి. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.



అధికారులతో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత..

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ఎన్నికల సిబ్బందితో ఐజీ అశోక్ కుమార్ సమీక్ష

భీమవరం క్రైం, మార్చి 27 : ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు అందరూ అలసత్వం లేకుండా ఉద్యోగ నిర్వహణ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల సమయంలో క్రిమినల్ కేసులు నమోదయ్యి ఉన్నవారిని ముందుగా బైండోవర్ చేసి వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ముందుగానే సమస్యాత్మక , అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆ ప్రాంతాలలో ప్రత్యేక అధికారులను నియమించి, సాయుధ దళాలతో సాయంతో ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా భరోసా కల్పించాలన్నారు. ప్రతీ సెక్టార్ పోలీస్ ఆఫీసర్ వారి పరిధిలోని గ్రామాలు, పోలింగ్ స్టేషన్లు సందర్శించాలని, అక్కడ చేపట్టవలసిన భద్రతా చర్యలు, గత ఎన్నికలలో జరిగిన వర్గవిభేదాలు, రాజకీయ గొడవలు, ప్రస్తుత పరిస్థితులు సమీక్షించి పై అధికారులకు తెలియజేయాలన్నారు. ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికా బద్ధమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, జిల్లా అదనపు ఎస్పీ (ఎస్బీబీ) రవికుమార్, తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి, భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, నర్సాపురం డీఎస్పీ శ్రీనివాసరావు, పశ్చిమ గోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ సత్యనారాయణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తూరు చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

ఎన్నికల తనిఖీలు.. రూ.2.50 లక్షలు సీజ్

కామవరపుకోట/ నిడమర్రు మార్చి 27 : ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద బుధవారం అధికారులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఒక వాహనంలో 75 వేల రూపాయల నగదు తీసుకువెళ్తుండగా వాటిని మండల తహసీల్దార్ రమేష్ సీజ్ చేసి మండల పరిషత్ ఏవో సత్యవాణికి అందజేశారు.తడికలపూడి ఎస్‌ఐ జయ బాబు, ఎన్నికల అధికారులు మొహిద్దీన్, శేషగిరి, తదితరులు ఉన్నారు. నిడమర్రు పోలిస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారులో లక్షా 75 వేల రూపాయలు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తీసు కు వెళుతుండగా సీజ్ చేసినట్టు నిడమర్రు ఎస్‌ఐ ఆర్.శ్రీను తెలిపారు. తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ భాషా, టీం సభ్యులు మనోహర్, దుర్గారావు, రవికుమార్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా ఉన్న కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్

అనుమతులున్నాయంటూ దోచేశారు

పది రోజులపాటు కరుగోరుమిల్లి ర్యాంప్ నుంచి ఇసుక దోపిడీ

ర్యాంప్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్

ఆచంట, మార్చి 27: ఇసుకకు ప్రస్తుతం పెద్ద ఎత్తున డిమాండ్ ఉండటంతో ఇదే అదునుగా చేసుకుని ఆచంట మండలం కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌కు అనుమతులు వచ్చాయంటూ కొంతమంది బాట ఏర్పాటు చేసి సుమారు పది రోజులు పాటు ర్యాంప్ నుంచి ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలతో రద్దీ ఏర్పడింది. సుమారు రోజుకు రూ. 5 లక్షలు పైగానే ఇసుక అమ్మకాలు జరిగినట్లు సమాచారం. ఏదో సంస్థ పేరు చెప్పి ర్యాంప్ అనుమతులు వచ్చాయంటూ పది రోజులు ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరిపి నిర్వాహకులు జేబులు నింపుకున్నారు. అయితే మంగళవారం మైనింగ్, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఈ ర్యాంప్‌ను పరిశీలించారు. అయితే ర్యాంప్‌లో అప్పటికే ఇసుక తవ్వకాలు ఆపేశారు. బుధవారం నరసాపురం సబ్ కలెక్టర్ అచ్చుత అంబరిస్ , రెవిన్యూ అధికారులు కలిసి ర్యాంప్‌ను పరిశీలించారు. ర్యాంప్‌లో మిషన్‌లు గాని, నిర్వహకులు గాని ఎవరూ లేరు. ఈ ర్యాంప్‌కు సంబంధించి కేవలం మనుషులకు మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని ప్రచారం. పది రోజులుగా అనుమతులు ఉన్నాయంటూ ఇసుకర్యాంప్‌ను దోచసి జేబులు నింపుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అమలు ర్యాంప్‌కు పర్మిషన్‌లు ఉన్నాయా.. లేవా అనే వాటిని ఆయా ర్యాంప్‌ల వద్ద ఫ్లెక్సీలు రూపంలో ప్రదర్శించాలని పలువురు కోరుతున్నారు.



పెదవేగిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన 'పది' ప్రధాన పరీక్షలు

1 నుంచి జవాబు పత్రాల మూల్యాంకన



ఏలూరు సత్రంపాడు పరీక్షా కేంద్రంలో తనిఖీకి వచ్చిన డీఈవో అబ్రహం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 27 : పదో తరగతి ప్రధాన పరీక్షలు బుధ వారం ముగిశాయి. అతి తక్కువమంది విద్యార్థులు రాసే ఒకేషనల్ పరీక్షలు ఈ నెల 30తో ముగుస్తాయి. బుధవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు ఏలూరు జిల్లాలో 23,813 మంది రెగ్యులర్ విద్యార్థులు రాయాల్సి ఉండగా 23,024 మంది హాజరయ్యారని, మరో 2,874 మంది ప్రైవేటు విభాగం విద్యార్థులకు గాను 1,232 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలి పారు. ఏలూరులోని పలు పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీలకుడు ఆర్.నర సింహారావుతో పాటు, డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వివరించారు. జవాబుపత్రాల మూల్యాం కనను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసారు. వివిధ జిల్లాల నుంచి రెండు లక్షల ఆన్సర్ స్క్రిప్ట్‌లు అన్ని సబ్జెక్టుల నుంచి వంపారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం స్పాట్ వాల్యుయేషన్‌ను వచ్చేనెల 8న ముగించాల్సి వున్నప్పటికీ ఒకరోజు ముందుగానే పూర్తిచేసేలా ప్లాన్ చేస్తున్నారు. మూల్యాంకన విధులకు నియమితులైన సిబ్బందికి నియామక పత్రాలను ఇప్పటికే జారీచేశారు.

భీమవరం ఎడ్యుకేషన్ : పశ్చిమ గోదావరి జిల్లాలో 127 పరీక్షా కేంద్రాలలో 21,511 విద్యార్థులకు గాను 20,752 మంది హాజరవగా 759 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆరు పరీక్షా కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 45 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఏ విధమైన మాస్ కాపీయింగ్ నమోదు కాలేదని డీఈవో వెంకటరమణ తెలిపారు. వీరవాసరంలో జడ్పీ హైస్కూల్‌లో ఏప్రిల్ 1 నుంచి జవాబు పత్రాల మూల్యాంకన జరుగుతుంది.

గోప్యం ఎందుకో ?!

సమాచారం ఇవ్వడంలో గప్ చుప్

4తో ముగియనున్న ఇంటర్ మూల్యాంకనం



భీమవరంలో ఇంటర్ మూల్యాంకనం జరుగుతున్న కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాల

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 27 : చడీచప్పుడు లేకుండా ఇంటర్ మూల్యాంకనం చేపట్టారు. వివరాలు అడిగితే సమాచారం ఇచ్చేందుకు వాయిదా వేస్తూ వచ్చారు.మూల్యాంకనంలో సమస్యలున్నాయంటూ ఒక పక్క విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఎగ్జామ్ కన్వీనర్ చంద్రశేఖర్ బాబును వివరాలు కోసం పలుమార్లు అడిగినా వివరాలు ఇవ్వలేదు. సరైన బందోబస్తు లేక పోవడం, మూల్యాంకన నిర్వహణ తీరులో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈనెల 9వ తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం భీమవరం పట్టణంలోని కేజీఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. అయితే ఈ సమాచారం అందించడంలో అధికారులు దాగుడు మూతలు ఆడారు. దీనిపై మూల్యాంకన కేంద్రానికి వెళ్లి కన్వీనర్ చంద్రశేఖర్‌బాబు కలిసి వివరాలు అడగ్గా తెలిపారు. 9న సంస్కృతం, 18వ తేదీ నుంచి తెలుగు, హిందీ, సివిక్స్, మాథ్స్, ఇంగ్లీషు సబ్జెక్టులు మూల్యాంకనం చేపట్టగా 24వ తేదీ నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, 26 నుంచి బోటని, జువాలజీ, హిస్టరీ పూర్తిచేశారు. 28వ తేదీ నుంచి కామర్స్ మూల్యాంకనం మొదలు పెట్టనున్నారు. ఏప్రిల్ 4వ తేదీతో మూల్యాంకనం ముగియాల్సి ఉందని 452 మంది మూల్యాంకనం చేస్తున్నట్లు తెలిపారు.

పేరుకుపోతున్న బకాయిలు

పంచాయతీలకు ట్రాన్స్‌కో నోటీసులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.100.72 కోట్లు

ఇప్పటివరకు చెల్లించింది రూ. 2.20 కోట్లు



ఏలూరు సిటీ, మార్చి 27 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పంచాయతీల విద్యుత్ బకాయిలు పేరుకు పోతున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధులున్నా ఈ చెల్లింపులు ఆశించిన స్థాయిలో జరగక పోవడంతో ఈ బకాయిలు చెల్లించాలని ఏపీఈపీడీసీఎల్ గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు విద్యుత్ సబ్‌డివిజన్ల పరిధిలో మొత్తం 937 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు సంబంధించి గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు పరిశీలిస్తే మొత్తం రూ.100.72 కోట్లు బకాయిలు ఉన్నాయని ఏపీఈపీడీసీఎల్ నివేదికలు చెబుతున్నాయి. విద్యుత్ బకాయిలు ఆర్థిక సంఘ నిధుల నుంచి చెల్లించాలని ఎప్పటి నుంచో చెబుతున్నారు. అయితే ఇటీవల వరకు ఆర్థిక సంఘ నిధులు సక్రమంగా రాకపోవడంతో బకాయిలు చెల్లించలేక పోయామని పంచాయతీలు చెబుతున్నాయి. జిల్లాలోని 937 పంచాయతీలకు సంబంధించి మొత్తం 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.58.70 కోట్లు పంచాయతీల్లో జమయ్యాయని వాటి నుంచి ఈ బకాయిలు చెల్లించాలని విద్యుత్ శాఖ కోరుతోంది. అయినా బకాయిలు రాకపోవడంతో ఏపీఈపీడీసీఎల్ నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 1వ తేదీ వరకు వచ్చిన వసూళ్ళు పరిశీలిస్తే కేవలం రూ. 2.20 కోట్లు మాత్రమే వసూలయ్యాయని అధికారులు చెబుతున్నారు. బకాయిల చెల్లించాలని ఇప్పటికే పంచాయతీలకు నోటీసులు జారీ చేశామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులు పంచాయతీలకు జమ అయినందున వాటి నుంచి ఈ బకాయిల చెల్లించాలని కోరారు.

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు పరిశీలిస్తే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 937 పంచాయ తీలకు సంబంధించి మొత్తం విద్యుత్ బకాయిలు రూ. 100.72 కోట్లు ఉన్నాయని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

విద్యుత్ సబ్ డివిజన్	బకాయిలు(రూ.కోట్లలో)	చెల్లించింది	చెల్లించాల్సింది
భీమవరం (101 పంచాయతీలు)	రూ.6.60	రూ.25.90	రూ.6.34
ఏలూరు (200 పంచాయతీలు)	రూ.33.58	రూ.27.32	రూ.33.31
జంగారెడ్డిగూడెం (164 పంచాయతీలు)	రూ.21.94	- —	----
నరసాపురం (186 పంచాయతీలు)	రూ.6.87	రూ. 44.92	రూ.6.42
నిడదవోలు (155 పంచాయతీలు)	రూ. 22.98	రూ. 65.59	రూ.22.32
తాడేపల్లిగూడెం(131 పంచాయతీలు)	రూ. 8.72	రూ. 56.74	రూ. 8.16

క్రైం కార్నర్

పోలవరం ప్రాజెక్టులో ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు కార్మికులకు గాయాలు

పోలవరం, మార్చి 27 : పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ మన్సూర్, రవీన్ సాదా అనే ఇద్దరు కార్మికులకు గాయాలవడంతో 108 వాహనంలో పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం చికిత్స కోసం రవీన్ సాదా అనే వ్యక్తిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. దీనిపై ఎలాంటి సమాచారం లేదని పోలవరం పోలీసులు తెలిపారు.

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

ఏలూరు క్రైం, మార్చి 27 : అనుమానంతో అర్ధరాత్రి వేళ భార్యను హతమార్చిన భర్తపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి పురుషోత్తమకుమార్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన తాళ్ళూరి వెంకటేశ్వరరావు 2016 ఏప్రిల్ 9వ తేదీ అర్ధరాత్రి నిద్రిస్తున్న తన భార్యను అనుమానంతో కొబ్బరిబొండాలు నరికే కత్తితో మెడపై నరికి హత మార్చాడు. పెదవేగి పోలీసులు వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేసి అప్పటి ఏలూరు రూరల్ సీఐ అడపా నాగమురళి కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేశారు. వెంకటేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనేరు సీతా రామారావు వాదించగా ప్రాసిక్యూషన్‌కు పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్‌కుమార్, పెదవేగి ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వాసు, జిల్లా కోర్టుల లైజన్ ఆఫీసర్ సిసిలీ సహకరించారు. ఈ కేసులో శిక్ష పడే విధంగా సహకరించిన పెదవేగి సీఐ సిబ్బందిని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

పొగాకు రైతుపై కూలీ దాడి



బాధితుడిని 108లో జంగారెడ్డిగూడెంఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జీలుగుమిల్లి, మార్చి 27 : పి.రాజవరంలో పొగాకు రైతు బోదా రామ్మోహన్ రెడ్డిపై పొగాకు బ్యారన్ క్యూరింగ్‌కు వచ్చిన కూలీ బుధవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. పొట్టలో గాయమై రక్తస్రావం అవడంతో చికిత్స నిమిత్తం జీలుగుమిల్లి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు చంద్రుగొండ నాగేంద్ర బాబు పక్క బ్యారన్ వద్ద పొగాకు క్యూరింగ్ (ఉడికింపు) పనులకు భద్రాచలం జిల్లా, కూనవరం మండలం పొచవరానికి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై ఎస్‌ఐ చంద్రశేఖర్‌ను అడగ్గా జరిగిన సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

భార్యాభర్తలపై దాడి..కేసు నమోదు

పాలకోడేరు, మార్చి 27 : షాపు ఇంకా ఖాళీ చేయలేదంటూ రాడ్‌తో దాడి చేయడమే కాకుండా చంపుతామని బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. విస్సాకోడేరు గ్రామానికి చెందిన పిల్లి శ్యామ్యూల్ అద్దెకు తీసుకుని ఒక షాపు నడుపుతున్నాడు. 26వ తేదీన షాపు వద్దకు వెళ్లి షాపు ఇంకా ఖాళీ చేయాలేదా అంటూ శ్యామ్యూల్‌ను ఓ వ్యక్తి రాడ్‌తో దాడి చేశాడు. అడ్డు వెళ్ళిన భార్యపై కూడా దాడి చేశాడు. దీంతో భార్య, భర్తలిద్దరూ భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొల్లేరులో సాగు వివాదం

రైతులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణ



నిడమర్రు మార్చి 27 : కొల్లేరులో రైతులకు ఫారెస్టు సిబ్బందికి మధ్య జరిగిన గొడవతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుధవారం నిడమర్రు గ్రామం మొండికోడు పాయలో సుమారు 350 ఎకరాల వవ్యవసాయ భూమిని రైతులంతా ట్రాక్టర్లతో దుక్కు చేస్తుండగా అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొన్నారు. తాము 50 సంవత్సరాలుగా ఈ భూముల్లో సాగు చేసుకొంటున్నామని పైన తవ్విన ఆక్వా చెరువలు వల్ల ఉప్పునీరు కారణంగా పంట పండడం లేదని వాపోయారు. కొల్లేరులో సంప్రదాయ వ్యవసాయం చేసుకొని వరిపంట పండించుకోవడానికి మాత్రమే అనుమతి ఉందని సాగు పేరుతో చేపల చెరువులకు సాగుచేయడం నేరమని జిల్లా ఫారెస్టు అధికారి హిమ శైలజ అన్నారు. అటవీశాఖ అధికారులు అడ్డు తగులుతున్నారని రైతులు ధర్నా చేపట్టారు. భవిష్యత్తులో తమ పొలాలను చెరువులుగా మార్చమని వ్యవసాయం మాత్రమే చేయగలమని హామీ ఇస్తే సాగుకు తమ అభ్యంతరం లేదని ఆమె తెలిపారు. వాదోపవాదాలు నడుమ రైతులకు ఫారెస్టు సిబ్బందికి తోపులాట జరిగింది. ఫారెస్టు అధికారులు మాట్లాడుతూ కాంటూరు పట్టా భూములలో వ్యవసాయం చేసుకోవడానికి తమకు అభ్యంతరం లేదని ముంపు పేరుతో గట్లు ఎక్కువ వేయవద్దన్నారు.

వైసీపీలో క్రమశిక్షణ లేదు : ఎమ్మెల్యే ఎలీజా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి, మార్చి 27: వైసీపీలో క్రమశిక్షణ లేదని, తనకు జరిగిన అవమానం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తరువాత స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రజాసేవలోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై తన ఫొటో, పేరును తొలగిండం తాను అవమానంగా భావించానన్నారు. క్రమశిక్షణలేని పార్టీలో ఉండదలచుకోలేదని, అందుకే రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయటానికి కృషిచేస్తానని, పదేళ్లలో విభజన హామీలు నెరవేరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తానని రాహుల్‌గాంధీ చెప్పారని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చే వరకు తానే ఎమ్మెల్యేనని, తన హయాంలో చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, గురుకుల పాఠశాల నూతన భవనాల్లోకి మార్చడం, చింతలపూడిలో బస్సు డిపోకు ప్రతిపాదన చేశానన్నారు. తాను చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో ఉంటానని, అధిష్ఠానం ఆదేశిస్తే ఎన్నికల్లో పోటీ చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, వి.సుందరరావు, కాంగ్రెస్ నాయకురాలు కావూరి లావణ్య, బోసురెడ్డి, సుందరం, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే దళితులకు మేలు

ఏలూరు టూటౌన్, మార్చి 27: చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనే దళితులకు మేలు జరిగిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ టీడీపీ కూటమికి మద్దతు ప్రకటిస్తే కొంత మంది దళితులు ఆయనను దళిత ద్రోహిగా చిత్రీకరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే కూటమికి ఎమ్మార్పీఎస్ మద్దతు తెలిపిందన్నారు. దళితులకు చెందిన 27 పథకాలను జగన్ దుర్మార్గంగా రద్దు చేశాడన్నారు. విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగన్‌పేరు పెట్టుకోవడం అహం కారానికి నిదర్శనమన్నారు. పీజీ చదువుకునే దళిత విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్ మెంట్ లేకుండా చేశారన్నారు. 45 ఏళ్లు దాటిన దళితులకు పింఛన్ ఇస్తానని జగన్ మోసం చేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్ని నవరత్నాల పేరుతో దారి మళ్ళించాడన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే దళితుల పరిస్థితి దుర్భరంగా మారుతుందన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు.

గోపాల్ యాదవ్ వ్యాఖ్యలపై టీడీపీ నేతల ఖండన



మాట్లాడుతున్న దాసరి ఆంజనేయులు

ఏలూరు టూటౌన్, మార్చి 27: ఏలూరు ఎంపీ టిక్కెట్ ఆశించి భంగపడిన గోరుముచ్చు గోపాల్ యాదవ్ టీడీపీ, చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు అన్నారు. సింగపూర్ నుంచి వచ్చి ఎంపీ టిక్కెట్ కోసం ప్రయత్నం చేసి మరలా సింగపూర్ పారిపోయిన వ్యక్తికి టిక్కెట్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, టీడీపీ నాయకులపై గోపాల్ అసత్య ప్రచారాలు చేస్తున్నాడన్నారు. టీడీపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటాడని హెచ్చరించారు.

జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీలో వెంకటలక్ష్మి



నియామక పత్రం ఇస్తున్న పవన్‌కల్యాణ్

ఏలూరు రూరల్, మార్చి 27: జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ కార్యదర్శిగా ఘంటసాల వెంకటలక్ష్మిని నియమిస్తూ అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కృషిని గుర్తించి పవన్‌కల్యాణ్ తనకు పదవిని అప్పగించారని తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేయడమే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని, ఉమ్మడి ప్రభుత్వం రాగానే రాష్ట్రస్థాయి కేబినెట్ హోదాతో సమానమైన పదవి తనకు ఇస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారని ఘంటసాల వెంకటలక్ష్మి తెలిపారు.

రాష్ట్రంలో డ్రగ్ మాఫియా : ఐద్వా జిల్లా కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామలరాణి

ఏలూరు టూటౌన్, మార్చి 27: రాష్ట్రంలో డ్రగ్ మాఫియా విచ్చలవిడిగా నడుస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామలరాణి అన్నారు. అన్నే భవన్‌లో హైమావతి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. శ్యామలరాణి మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్ మాఫియా విస్తరిస్తుందన్నారు. యువత భవిష్యత్ నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్య నిషేధం చేస్తామని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలన్నారు. వేసవి ఎండలు ముదురుతున్న దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎం.వరలక్ష్మి, ఉషారాణి, శారద, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూచింపూడిలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

పెదవేగి, మార్చి 27: కూచింపూడి పురాతన రామాలయం పునర్నిర్మించారు. ఆలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వివిధ గ్రామాలనుంచి వేలాదిగా భక్తులు విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదపాడు, మార్చి 27: భక్తుల శివన్నామ స్మరణతో సత్యవోలు గ్రామం మార్మోగింది. నూతనంగా నిర్మించిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం వైభవంగా వేదపండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు జరిగాయి. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు పూజలు నిర్వహించారు. ఉదయం అగ్ని భస్మధారణ, శిఖర కుంభాభిషేకం, స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహించగా, వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



గూటాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

పోలవరం, మార్చి 27: పదో తరగతి పరీక్షలు బుధవారం ముగిశాయి. ప్రధాన పరీక్షలు పూర్తి కాగా వొకేషనల్, సంస్కృతం పరీక్షలు శనివారం వరకు జరుగుతాయి. మండలంలో గూటాల ఉన్నత పాఠశాలలో 131 మంది విద్యార్థులకు 109 మంది, పోలవరం పాఠశాలలో 262 మందికి 256 మంది, కచేరి సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 79 మంది విద్యార్థులకు 41 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

● టి.నరసాపురం: ప్రశాంతంగా పది పరీక్షలు ముగిశాయని ఎంఈవో టి.రామ్మూర్తి తెలిపారు. పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించిన నాలుగు పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీవోలు, ఇన్విజిలేటర్లు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, ఆరోగ్య సిబ్బందికి విద్యాశాఖ తరుపున ధన్యవాదాలు తెలిపారు.

● లింగపాలెం: మండలంలోని పరీక్షాకేంద్రాలను డీఈవో అబ్రహం తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షలు చివరిరోజు కావడంతో ఆయన పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదపాడు: మండలంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షకు 160 మంది గైర్హాజరు కాగా, మొత్తం 1215 మందికి 1055 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద మాస్ కాపీయింగ్ జరగకుండా తగు చర్యలు చేపట్టినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

● పెదవేగి: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిం చారు. ఆరు కేంద్రాల్లో కలిపి 935 మంది మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 829 మంది పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో సీహెచ్. బుడవాస్ తెలిపారు. ఆరు కేంద్రాల్లో కలిపి 106 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ఠ బందోబస్తు, విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఎంఈవో వివరించారు.



నిడమర్రులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని



దెందులూరులో పార్టీలో చేరినవారితో చింతమనేని



ఏలూరులో పూజలు చేస్తున్న బడేటి చంటి



జనసేనలో పార్టీలో చేరిన వారిని స్వాగతిస్తున్న ధర్మరాజు

ప్రజల చెంతకు..

టీడీపీ, జనసేన అభ్యర్థుల పర్యటనలు

వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరికలు

నిడమర్రు, మార్చి 27: జిల్లాలో పలుచోట్ల టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రజల చెంతనే ఉంటున్నారు. ప్రజా సంకల్పయాత్ర, పాదయాత్ర పేరిట ప్రజల్లోకి వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు చేపడుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆకాంక్షించారు. పాదయాత్ర పోస్టర్‌ను ఎంపి అభ్యర్థి పుట్టా మహేష్ బుధవారం ఆవిష్కరించారు. ధర్మరాజు మాట్లాడుతూ గురువారం గణపవరం మండలం మొయ్యేరులో పాదయాత్ర ప్రారంభమై 30న పోలసానిపల్లెలో ముగిస్తామన్నారు. అనంతరం ద్వారకాతిరుమల ప్రయాణం ఉంటుందని, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్యాల స్వామి, అంబళ్ల విజయభాస్కర్, నిమ్మల దొరబాబు, వంగా రఘు, బాసిరాజు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు

● దెందులూరు: వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. టీడీపీ దెందులూరులో యిప్పిలి వెంకటేశ్వరావు, కొండయ్య చౌదరి, మహేష్ యాదవ్ పార్టీ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 200 మంది టీడీపీలో చేరారు. కొప్పుల వెలమ సంఘం రాష్ట్ర నాయకుడు సంపంగి వేణుగోపాల తిలక్, కొలుసు నాని, కాంట్రాక్టర్ దాసే శ్రీను, మేడూరి వెంకటేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు, ఉప్పు తులసిరామ్ మరో 200 మంది మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి చింతమనేని టీడీపీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. వైసీపీలో ఎస్సీ, బీసీలకు తగిన గుర్తింపు లేదని, తిరిగి అక్రమంగా ఎస్సీ ఎస్టీ, అట్రాసిటీ కేసులతో వేధిస్తున్నారని తిలక్ అన్నారు. కాంట్రాక్టర్ దాసే శ్రీను మాట్లాడుతూ తాను సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవన నిర్మాణం చేపట్టానని, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై విరక్తితో టీడీపీలో చేరానన్నారు. కార్యక్రమంలో మిల్లుబాబు, నాని, ఏనుగు రామకృష్ణ, తాత సత్యనారాయణ, పసుమర్తి మధు, శేషారత్నం, పలువురు టీడీపీ నేతలు ఉన్నారు,

పెదపాడు: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ ఇంటి వద్ద జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి చేయాలన్నారు. ఘంటశాల వెంకటలక్ష్మి సారథ్యంలో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని జనసేన నాయకులు హామీనిచ్చారు.

కూటమి విజయం సాధించాలని పూజలు

ఏలూరు టూటౌన్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించాలని టీడీపీ అభ్యర్థి బడేటి చంటి పూజలు చేశారు. 49వ డివిజన్‌లో వేణుగోపాలస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. నెర్సు గంగరాజు, మాగంటి హేమసుందర్, ఇసుకపల్లి తాతారావు, వందనాల శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో జనసేన, టీడీపీ, బీజేపీ ఎన్నికల ప్రచారం

భీమడోలు: అర్జావారిగూడెంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనంలోకి ధర్మరాజు పేరుతో ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి వివరించారు. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, తెలుగుదేశం నాయకులు గన్ని నాగగోపాలరావు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

గణపవరం: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యమని జనసేన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరంలో వేగేశ్న గనిరాజు, రామరాజు, సూతాని సాయి, మామిడాల మణికంఠ, ముత్యాల సాయితో పాటు 30 మందికి ధర్మరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో జనసేన కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు రామకృష్ణంరాజు, జనసేన మండల నాయకుడు తోట శ్రీనివాసరావు, గణప వరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, యువత అధ్యక్షుడు కాపారం చిన్న, మైనార్టీ నాయకుడు బషీర్ తదితరులు పాల్గొన్నారు.







దెందులూరు, పెదవేగిలో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి, తహసీల్దార్ సూర్యప్రభ, లింగపాలెం మండలంలో వాహనాల తనిఖీ

దేశ ప్రగతికి ఓటు కీలకం : జేసీ

దెందులూరు, మార్చి 27: దేశ ప్రగతికి ఓటు కీలకమని ఆర్వో, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వంచారు. ఎన్నికల నియామవళి ఉల్లంఘనపై ఫిర్యాదు అందిన అర్థగంటలోపు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, నూరు శాతం పోలింగ్‌కు అధికారులు కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం తహసీల్దార్ జితేంద్రతో కలిసి సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు లోను చేయకుండా నిఘా ఉంచాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలే

పెదవేగి: ఎన్నికల నిబంధనలు మీరితే చర్యలు తప్పవని తహసీల్దారు సూర్యప్రభ అన్నారు. పినకడిమి సచివాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వివిధ రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ ఉన్నంత కాలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికి మించి గుమికూడి ఉండకూడదని, ప్రచారానికి ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. వాహనాలపై స్టిక్కర్లు, జెండాలు, ఇంటిపైన రాజకీయపార్టీ జెండాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అన్నారు. నిబంధనలను అనుసరించి మాత్రమే నడుచుకోవాలని, రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లితే దానికి సరైన ఆధారాలు చూపించాలని, లేకుంటే నగదు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో వెంకటరమణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎక్కువ మొత్తం నగదు ఉంటే సీజ్

లింగపాలెం, మార్చి 27: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రత్యేక బృందాలు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బృందం ఇన్‌చార్జ్ జె.శాంతి ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి మద్యం, నగదు అక్రమ తరలింపుపై హెచ్చరికలు చేశారు. రూ.50వేలకు మించి నగదు తీసుకువెళ్లవలసి వస్తే సరైన పత్రాలు ఉంచుకోవాలన్నారు. మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే ఇతర వస్తువులు తీసుకువెళితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు హెడ్ కానిస్టేబుల్ జయరాజు, బి.వి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంక్షేమ కమిటీ పనితీరు మెరుగుపడాలి

ఏలూరు కలెక్టరేట్, మార్చి 27 : జిల్లా బాలల సంక్షేమ కమిటీ పనితీరు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ హెచ్చరించారు. బాలల సంక్షేమ కమిటీ తీసుకున్న చర్యలపై బుధవారం కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో వివిధ కారణాలతో నిరాదరణకు గురైన బాలల వివరాలు, వారి సంక్షేమానికి తీసుకునే చర్యలపై కమిటీ సభ్యులు సరైన సమాచారం అందించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి సమావేశానికి పూర్తి వివరాలతో హాజరు కావాలని లేని పక్షంలో బాలల సంక్షేమ కమిటీ రద్దుకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి, చిల్డ్రన్‌హోమ్ సూపరింటెండెంట్ వల్లీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోకో రైతులు, అధికారులతో సమీక్ష

అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజల ధర పెరిగిన దృష్ట్యా ఆ ధర రైతులకు అందుతుంది, లేనిది పరిశీలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. ఉద్యానవన, రైతులు, కోకో కొనుగోలుదారులతో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. కేజీ కోకో గింజలు రూ.250 నుంచి క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.700 ఉందన్నారు. ఉద్యానవన డీడీ రామ్మోహన్‌రావు, రైతులు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

జిల్లాలో నిఘా పెంచాలి

ఏలూరు సిటీ, మార్చి 27: ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీలు మరింత అప్రమత్తంగా ఉండి జిల్లా వ్యాప్తంగా నిఘా మరింత పటిష్ఠ పరచాలని కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు తదితరులతో ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు.

పారం-7, 8 వేగవంతంగా పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న పారం 7, 8 లను వేగవంతంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో పెండింగ్‌లో ఉన్న ఫారం- 7, 8 ల దరఖాస్తుల పరిష్కారం, రాజకీయ పార్టీలకు అనుమతులు జారీ, సివిజిల్ ద్వారా అందుతున్న ఫిర్యాదుల పరిష్కారం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పటిష్ఠంగా అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

సి విజిల్ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించండి

సి విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం వివిధ నియోజకవర్గాల ఆర్‌ఓలు, నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలుపై జాయింట్ కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక

ఏలూరు కలెక్టరేట్, మార్చి 27: వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి ఇబ్బందిలేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని డీఆర్వో పుష్పమణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తాగునీటి ఏర్పాటుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అవసరం ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. గోదావరి, కృష్ణాకాలువల ద్వారా పూర్తిస్థాయిలో చెరువులు నింపాలని, పంట కాలువలకు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా గుర్రపు డెక్కలను తొలగించాలన్నారు. జడ్పీ సిఈవో సుబ్బారావు, డ్వామా పీడీ రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు

భీమడోలు, మార్చి 27: పదో తగరతి పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ దివ్య, సీఐ రవికుమార్ హెచ్చరించారు. భీమడోలు జడ్పీ హైస్కూలు ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు టూ వీలర్ వాహనాలను ఇవ్వద్దని, ప్రమాదాలకు తావు ఇవ్వద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి కృషి : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 27: హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేసిన హోంగార్డు కోటేశ్వరరావు (హెచ్‌జి 134) 2022 డిసెంబర్ 31న పదవి విరమణ చేశారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5,50,960 చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి అందజేశారు. హోంగార్డు కుటుంబాల సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

నేడు 19ఏళ్ల విభాగం క్రీడా జట్ల ఎంపిక పోటీలు

పెదవేగి, మార్చి 27: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 19 ఏళ్ల విభాగం మోడరన్ పెంటాథిలిన్(అథ్లెటిక్) క్రీడా జట్ల ఎంపిక పోటీలు గురువారం నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు గురుకుల విద్యాలయానికి చేరుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 99493 66162 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మృతి చెందిన కూలీల కుటుంబాలను ఆదుకోవాలి

ఏలూరు టూటౌన్, మార్చి 27: ఆగిరిపల్లి మండలం గొల్లగూడెంకు చెందిన ఇద్దరు రోజువారి కూలీలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. గాయపడిన వారికి ఉచిత వైద్య సేవలందించి తగిన నష్టపరిహారం ఇవ్వాలన్నారు.



పనులు కల్పించాలని ధర్నా నిర్వహిస్తున్న కూలీలు, నేతలు

పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఏలూరు కలెక్టరేట్, మార్చి 27: నగర పాలక సంస్థలో విలీనం చేసిన ఏడు గ్రామాల్లో పేదలకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పేదలకు ఉపాధి పనులు కల్పించాలి, న్యాయం చేయాలి అంటూ నినాదాలు చేశారు. జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ నిరుపేదలు, వ్యవసాయ పనులు చేసుకునే కూలీలు రోజువారి పనికి వెళితేనే కుటుంబం గడిచే పరిస్థితి ఉందన్నారు. ఉపాధి హామీ పనులే పేదలకు దిక్కు అన్నారు. ఏలూరు నగరంలో ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడంతో వ్యవసాయ కార్మికులకు, ఉపాధిహామీ పని లేకుండాపోయిందన్నారు. పోణంగి, కొమరవోలు, చొదిమెళ్ళ, శనివారపుపేట, సత్రంపాడు, తంగెళ్ళమూడి, వెంకటాపురం పంచాయతీల్లో 10వేల మందికి జాబ్‌కార్డులు ఉన్నాయని, 2021 డిసెంబర్ 31వరకు ఆన్‌లైన్‌లోనే కనిపించాయన్నారు. 20 వేల మంది కూలీలు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతున్నాయన్నారు. నేడు వారికి ఉపాధి లేకుండా పోయిందని, కూలీలపై ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధిహామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు, మంచినీరు, మజ్జిగ కల్పించాలన్నారు. సీఐటీయూ నాయకుడు పి.కిషోర్, ఆజ్జేసమ్మ, లక్ష్మణ్, నాగేంద్ర, గోపి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ హుండీ ఆదాయం రూ.14.90 లక్షలు

పెదవేగి, మార్చి 27: రాట్నాలమ్మకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఏలూరు తనిఖీదారు సుజన్‌కుమార్, ఏలూరు పత్తేబాద గ్రూప్ ఆలయాల ఈవో డి.శంకర్ పర్యవేక్షణలో హుండీలను తెరిచి, ఆదాయాన్ని లెక్కించామని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. హుండీల ద్వారా మొత్తం రూ.14,90,334 ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** రెడ్‌క్రాస్ భవనంలో 13 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించామని రెడ్‌క్రాస్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, అభిమాన సంఘాలు, విద్యా సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు.
- **ఏలూరు ఎడ్యుకేషన్ :** 'మ్యూచువల్ ఫండ్స్ - పెట్టుబడి వ్యూహాలు' అంశంపై బుధవారం సీఆర్‌ఆర్ కళాశాలలో కామర్స్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. 'సెబి' ట్రైనర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు సూచనలు ఇచ్చారు. ఫణికుమార్, విష్ణుమోహన్ పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** తంగెళ్ళమూడిలో నిర్మితమైన ఆలయంలో బుధవారం రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.
- **పెదపాడు :** సొసైటీ సర్వసభ్య సమావేశం త్రిసభ్య కమిటీ చైర్మన్ అక్కినేని రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సొసైటీ ఆదాయ, వ్యయాలను సంఘ సీఈవో డీవీ సుబ్బారావు సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సంఘ సభ్యులు, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.
- **ఏలూరు కల్చరల్ :** బ్రాహ్మణ సంఘాల సహకారంతో ఈనెల 30న స్థానిక కంచి కామకోటి పీఠ సంస్కృతి వేదస్మార్త ప్రయోగ పాఠశాల ప్రాంగణంలో ఉచిత సామూహిక ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సీఏపీఎస్ రామానుజాచార్యులు, మైలవరపు గురుశర్మ తెలిపారు.
- **కుక్కునూరు :** పోలవరం నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి చిర్రి బాలరాజును కుక్కునూరు జనసేన నాయకులు బుధవారం కలిసారు. చిర్రి బాలరాజు విజయానికి అన్ని పార్టీలతో కలసి కృషి చేస్తామని తెలిపారు. జనసేన మండల అధ్యక్షులు ఎం.యుగంధర్, ఎం.వెంకన్నబాబు, ఆవుల శ్రీను, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉద్యోగులందరూ పాటించాలని ఎంపీడీవో వి.రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



జీలుగుమిల్లి మండలంలో పోలీసులు, సాయుధ బలగాల కవాతు

నిర్భయంగా ఓటు వినియోగించుకోండి

గ్రామాల్లో సాయుధ బలగాలతో పోలీసుల కవాతు

జీలుగుమిల్లి, మార్చి 27: ఓటర్లు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. రాచన్నగూడెం, కామయ్యపాలెం జీలుగుమిల్లి గ్రామాల్లో సాయుధ బలగాలతో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఓటర్లలో భయం తొలగడానికి, ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్లు సీఐ క్రాంతికుమార్ అన్నారు. ఎస్సై వి.చంద్రశేఖర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాత నేరస్థులపై నిఘా

లింగపాలెం: ఎన్నికల వేళ మండలంలో పాత నేరస్థులపై నిఘా ఉంచినట్లు ఎస్ఐ చెన్నారావు బుధవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గత ఎన్నికల్లో గొడవలకు, హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడే అవకాశం ఉన్న 150 మందిని గుర్తించి వారిని బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో లైసెన్సుడ్ తుపాకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎటువంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని ఎవరైనా హింసాత్మక ఘటనలకు గాని, ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వారిని అరెస్ట్ చేస్తామని, అటువంటి వారి పై చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు.

కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ

పెదపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలపర్రు టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. జంక్షన్, అప్పనవీడు తదితర గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొని దెందులూరు తిరిగి వస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కార్ల కాన్వాయిని పోలీసులు ఆపారు. కార్ల కాన్వాయిని క్షుణ్ణంగా తనిఖీ చేయవచ్చని ఆయన పోలీసులకు సహకరించారు. దీంతో పోలీసులు వాహనాలను తనిఖీచేసి ఎటువంటి అభ్యంతరకర సామగ్రి లేవని ధ్రువీకరించడంతో చింతమనేని కార్ల ముందుకు కదిలింది. తనిఖీల్లో పెదపాడు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు..కొన్ని మళ్లింపు



ఏలూరు క్రైం మార్చి 27 : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొన్ని రైళ్లను రద్దు చేశారు.మరి కొన్ని రైళ్లను దారి మళ్లించారు.వాటి వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా రాకపోకలను పూర్తిగా రద్దు చేశారు. ఈ రైళ్లు విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా మళ్లించారు.

రద్దయిన రైళ్లు ఇవీ..

17219 మచిలీపట్టణం-విశాఖపట్టణం ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ రద్దు
17220 విశాఖపట్టణం-మచిలీపట్టణం ఏప్రిల్ 2 నుంచి 29 వరకూ..
22701 గుంటూరు- విశాఖపట్టణం ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ
22702 విశాఖపట్టణం -గుంటూరు ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ

దారి మళ్లించిన రైళ్లు

దారి మళ్లించిన రైళ్లు ఏలూరు, తాడేపల్లిగూడెంల మీదుగా వెళ్లకుండా విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయి.

22643 యర్నాకుళం జంక్షన్ - పాట్నా ఏప్రిల్ 1, 8, 15, 22 వరకూ
12756 భావనగర్ - కాకినాడ పోర్టు ఏప్రిల్ 6, 13, 20, 27 వరకూ
12509 ఎస్ఎంవి బెంగళూరు- గౌహటి ఏప్రిల్ 3, 5, 10,12,17, 19, 24, 26
11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27
13351 ధన్‌బాగ్ - అల్సాస్ ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ
18111 టాటా - యశ్వంత్‌పూర్ ఏప్రిల్ 4, 11, 18, 25
12376 జాసిద్దిత్ - తాంబ్రం ఏప్రిల్ 3, 10, 17, 24
22837 హర్దాయ్ - ఎర్నాకుళం జంక్షన్ ఏప్రిల్ 1, 8, 15, 22
18637 హర్దాయ్ - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 6, 13, 20, 27
12835 హర్దాయ్ - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 2,7, 9,14,16, 21, 23, 28
12889 టాటా - ఎస్ఎంవీ బెంగళూరు ఏప్రిల్ 5, 12, 19, 26

వచ్చే నెలాఖరు వరకు బెంగళూరు ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

నరసాపురం, మార్చి 26:నరసాపురం బెంగళూర్ల మధ్య ప్రతి శుక్రవారం నడుస్తున్న వీక్లి ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 27 వరకు పొడిగిస్తూ దక్షణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లుగా నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్ ఈ నెలాఖరుతో ముగుస్తుంది. మళ్లీ పొడిగించడం లేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు రైల్వే అధికారులు స్పందించారు. 07153, 07154 నెంబర్లతో ఈనెల 29 నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ యధావిధిగా నడుస్తుందని ప్రకటించింది. నరసాపురం నుంచి వచ్చేనెల 5, 12, 19, 26 తేదీల్లో, తిరుగు ప్రయాణంలో బెంగుళూరు నుంచి ఈనెల 30, ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీల్లో ఈరైలు నడవనుంది. మంగళవారం నుంచే ఆన్‌లైన్ రిజర్వేషన్ బుకింగ్ అందుబాటులోకి తెచ్చింది. పాలకొల్లు, భీమవరం టౌన్, కైకలూరు, విజయవాడ, ఒంగోలు, రేణుగుంట, కాట్‌పాడి మీదుగా బెంగుళూరుకు వెళ్లనుంది..



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

మతతత్వ శక్తులను ఓడిద్దాం

నూజివీడు టౌన్, మార్చి 27: ప్రభుత్వ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ వారి కోసమే ప్రత్యేక చట్టాలను తీసుకువస్తోందని, మతతత్వ శక్తులను ప్రోత్సహిస్తోందని, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. నూజివీడులో పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మోదీ తిరిగి అధికారంలోకి వస్తే దేశం అధోగతిపాలవుతుందని, సార్వత్రిక ఎన్నికల్లో మోదీని ఓడించాలన్నారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ చైతన్యకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీపీఐ నాయకులు రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేశ్వరరావు, చెంగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చనుబండ రామాలయ హుండీ లెక్కింపు



చాట్రాయి, మార్చి 27: అపర భద్రాద్రి చనుబండ కోదండ రామాలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా రూ. 1.35 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుదాకర్ తెలిపారు. ఈవో అలివేణి, వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవ రెడ్డి, ఆలయ సిబ్బంది, కమిటీ పాల్గొంది.



పోతనపల్లిలో కాలిబాట

కాలిబాటలు కనుమరుగు..

- తోటలు, పొలాల చుట్టూ ఫెన్సింగ్..
- భారంగా మారిన ప్రయాణాలు

గ్రామాల్లో పూర్వకాలం నుంచి ప్రజల ప్రయాణ అవసరాలకు ఎంతో ఉపయోగపడిన కాలిబాటలు దాదాపు కనుమరుగైపోయాయి. ఎన్నోతరాలపాటు కాలిబాటలు ప్రజల జీవన స్రవంతిలో భాగమయ్యాయి. గ్రామీణ ప్రాంతాలలో రవాణా వ్యవస్థ లేనప్పుడు, రోడ్లు అభివృద్ధి చెందక ముందు కాలిబాటల గుండానే ప్రజలు రాకపోకలు సాగించేవారు.

చాట్రాయి, మార్చి 27: గ్రామాలకు మధ్య రోడ్డు మార్గం 6 కిలోమీటర్లుంటే కాలిబాట కేవలం 2 నుంచి 3 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. అడవులు, రైతుల భూములు, చెరువులు, వాగుల మీదుగా కాలిబాటలు సాగేవి. రైతులు కూడా కాలిబాటలు వదిలి పంటలు సాగుచేసేవారు. కాలిబాటల ద్వారా నడిచి వెళ్ళే వారికి రైతులు ఎటువంటి అభ్యంతరాలు చెప్పేవారు కాదు. కాలిబాటల్లో నడిచే ప్రజలు కూడా పంటలకు ఎటువంటి నష్టం జరక్కుండా మసులుకునేవారు. తాము తయారు చేసిన వస్తువులు, పండించిన పండ్లు, కూరగాయలు, కట్టెలు పెద్ద గ్రామాల్లో అమ్ముకొని నిత్యావసరాలు తెచ్చుకోటానికి, బంధువుల ఇళ్ళకు వెళ్ళటానికి, కోర్టులు, ప్రభుత్వ ఆఫీసులకు వెళ్ళటానికి అప్పట్లో కాలిబాటలే శరణ్యం. ఈ ప్రాంత ప్రజలు కోర్టు పనుల కోసం చద్ది మూటకట్టుకొని విజయవాడ, బందరు, తిరువూరు, నూజివీడు కూడా నడిచి వెళ్ళే వారని పెద్దలు చెబుతుంటారు. ఒకప్పుడు ప్రజల జీవనంలో భాగమైన కాలిబాటలు క్రమక్రమంగా కనుమరుగవుతూ వచ్చాయి. పల్లెల్లో భూములను స్థానికేతురులైన ధనవంతులు కొనుగోలు చేసి తోటల చుట్టూ ఫెన్సింగ్ వేసి, కార్పొరేట్ వ్యవసాయం చేస్తుండటం, భూముల విలువ పెరగటంతో రైతులు కూడా భూముల చుట్టూ రాళ్ళు పాతి కంచె వేయటం వల్ల కాలిబాటలు కనుమరుగయ్యాయి. ఎన్నో తరాల ప్రజల జీవనంలో భాగమైన కాలిబాటల కథ ముగిసినట్టేనని చెప్పవచ్చు.

సిబ్బంది లేరని..

చెక్‌పోస్ట్ ఎత్తేశారు!

- మద్వానిగూడెం వద్ద చెక్ పోస్టు ఎత్తివేత
- ఎన్నికల వేళ తొలగింపుపై ప్రజల్లో నిరసన
- మైనింగ్ మాఫియా కూడా చెలరేగిపోతుందని ఆందోళన

కలిదిండి, మార్చి 27 : మండలంలోని మద్వానిగూడెం వద్ద కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఎస్ఎస్ టీమ్ అధికారులు వాహనాల తనిఖీ నిమిత్తం చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. చెక్ పోస్టు వద్ద సిబ్బంది కొరత ఏర్పడటంతో చెక్ పోస్టును తీసి వేశారు. దీంతో కలిదిండి మండలంలో వాహనాల తనిఖీలకు చెక్ పోస్టు లేకుండా పోయింది. మండలంలో చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో నిత్యం చేపలు, రొయ్యల లోడు లారీలు మద్వానిగూడెం వద్ద ఉన్న ఉప్పుటేరు వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తాయి. సరిహద్దున ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వైపు వాహన రాకపోకలు అధికం. ప్రస్తుతం మద్వానిగూడెం వద్ద చెక్ పోస్టు లేకపోవటంతో సరిహద్దున ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు కలిదిండి మండలం నుంచి వాహనాల రాకపోకలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మైనింగ్ అనుమతులు లేకుండా టిప్పర్లు కలిదిండి మండలం నుంచి సరిహద్దున ఉన్న భీమవరంతోపాటు ఇతర ప్రాంతాలకు తరలించే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. వాహనాల్లో ఆధారాలు లేని నగదు, వస్తు సామగ్రి, దుస్తులు కూడా తరలించే అవకాశం ఉందని, వెంటనే మద్వానిగూడెం చెక్ పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ వివరణ

ఈ విషయమై ఎస్ఎస్ టీమ్ ఇన్‌చార్జి, కైకలూరు తహసీల్దార్ పోతురాజును వివరణ కోరగా, ఎస్ఎస్ టీమ్‌లో సిబ్బంది కొరత ఏర్పడడంతో మద్వానిగూడెం వద్ద చెక్ పోస్టును ఎత్తివేశామన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి పార్థసారథి



భైరవపట్నంలో మాట్లాడుతున్న కైకలూరు కూటమి అభ్యర్థి కామినేని

ఉత్తుత్తి జీవోలతో మోసగించిన ప్రభుత్వం

నూజివీడు, మార్చి 27: ఉత్తుత్తి జీవోలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు బాపూనగర్‌లో 'మన ఇంటికి మన సారథి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎస్సీలకు శ్మశాన వాటిక లేక ఇబ్బందిగా ఉందని ఆయనకు తెలపగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం ఎస్సీలకు శ్మశాన వాటికలు ఏర్పాటుచేయాలని జీవో విడుదల చేసిందని, అది నేటికీ అమలు కాకపోవడం శోచనీయమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు. గత ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే నేడు రాజకీయ నిరుద్యోగులకు పదవులు ఇచ్చేందుకు ఆ కార్పొరేషన్‌లు పనికి వచ్చాయని, కార్పొరేషన్ డైరెక్టర్లుగా తాము ఏం చేశామో తెలియక అవమానంతో తలదించుకునే పరిస్థితి నేడు డైరెక్టర్లకు ఏర్పడిందన్నారు. అమ్మ ఒడి ఇచ్చి విద్యావంతులను చేశామంటున్నారని, గత ప్రభుత్వాలు ప్రతి ఒక్కరికి స్కాలర్‌షిప్ ఇచ్చి ఉచితంగా విద్యను అందించటమే కాక ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించిందన్నారు. నేడు చదువుకున్న వారికి ఉద్యోగాలు లేకుండా పోయాయని, అధికార పార్టీ నెలకు రూ. 5 వేలు ఇచ్చి వలంటీర్లను నియమించి వారితో వెట్టిచాకిరీ చేయించటం దారుణమన్నారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, కౌన్సిలర్లు దాసరి స్వామియాదవ్, కొమ్మన విజయ, టీడీపీ నాయకులు మోచర్ల కృష్ణంరాజు, తుమ్మలపల్లి అశోక్, ముళ్ళపూడి రామారావు, తురకా మాణిక్యాలరావు, ఇళయరాజా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుర్మార్గ పాలనకు గుణపాఠం చెప్పాలి: కామినేని

మండవల్లి, మార్చి 27: దుర్మార్గ పాలనతో ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్న వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు కార్యకర్తలు నడుం బిగించాలని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండవల్లి మండలం భైరవపట్నంలో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగట్టారు. మాటల గారడీతో కాలయాపన చేసిందని, అభివృద్ధి లేదని కామినేని దుయ్యబట్టారు. ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలని వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలు, విస్మరించిన పథకాలపై ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, పార్టీ శ్రేణులు తేరా రమేష్, పళ్ళెం ఏడుకొండలు, బోయిన రాజేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుటేరు వద్ద కారు తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్సై రామకృష్ణ

జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు

కైకలూరు, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు కైకలూరు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు. బుధవారం కైకలూరు మండలం ఆలపాడు శివారు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దులో ఉప్పుటేరు వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కార్లు, బైకులను ఆపి తనిఖీ చేశారు. పలువురి నుంచి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డబ్బు, మద్యం తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



కృష్ణా జిల్లా జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న చింతమనేని

కార్యకర్తలకు అండగా ఉంటా : చింతమనేని

పెదపాడు, మార్చి 27 : కార్యకర్తలకు అండగా ఉంటానని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. బుధవారం హనుమాన్ జంక్షన్‌లో జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ ఇంటి వద్ద జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఎన్‌డీఏ కూటమి విజయానికి జనసేన శ్రేణులు కృషి చేయాలని కోరారు. జనసేన దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్త ఘంటశాల వెంకటలక్ష్మి సారథ్యంలో పూర్తి సహకారం అందిస్తామని జనసేన నాయకులు హామీ ఇచ్చారు.

ఘనంగా పెయ్యేరు పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ముదినేపల్లి, మార్చి 27 : పెయ్యేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆటల పోటీలు, చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు పాఠశాల హెచ్ఎం జేతాళ రాజేంద్ర ప్రసాద్, విద్యా కమిటీ ఛైర్మన్ నాగుల్ బీ, టీచర్ చక్రధర్ బహుమతులు అందజేశారు.

నేటి నుంచి కోటపాడులో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



చాట్రాయి, మార్చి 27: కోటపాడు గౌడ బజారు సెంటర్‌లో నిర్మించిన కోదండ రామాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 8.10 గంటలకు ఆగమ శాస్త్ర పండితుడు శ్రీసుదర్శనం రామదుర్గ కుమారాచార్యులుచే విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 28న విష్వక్సేనారాధన, పుణ్యాహం, పంచగవ్య ప్రాశన, అగ్నిధ్యానం, క్షీరాధివాసం, హోమాలు, 29న శ్రీసీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ, మహాగణపతిస్వామి వార్ల గ్రామోత్సవం జరుగుతుంది. 30న విగ్రహ ప్రతిష్ఠ సీతారాముల శాంతి కల్యాణం, అఖండ అన్న సమారాధన జరుగుతుందని భక్తులంతా తరలిరావాలని ఆలయ కమిటీ కోరింది.





ఆగిరిపల్లి, ముదినేపల్లి పరీక్షా కేంద్రాల నుంచి టెన్త్ పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

హమ్మయ్య.. ముగిశాయి

ముగిసిన టెన్త్ పరీక్షలు
ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, మార్చి 27: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నూజివీడు డివిజన్ పరిధిలో మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో సోషల్ పరీక్షకు 3,585 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 254 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవైఈవో సేవ్యా తెలిపారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 3,349 మందికి గాను 3,260 మంది పరీక్షకు హాజరయ్యారని, 89 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఇక ప్రైవేట్ విద్యార్థులు 236 మందికి గాను 71 మంది విద్యార్థులు మాత్రమే హాజరు అయ్యారని, 165 మంది గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 210 మంది విద్యార్థులకు 207 మంది, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో 174 మందికి 173 మంది, ఎస్వీ పబ్లిక్ స్కూల్‌లో 210 మందికి 208 మంది హాజరై ఆరుగురు గైర్హాజరు అయినట్లు ఎంఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

చాట్రాయి: బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు 31 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 214 మందికి గాను 201 మంది, ఆర్సీయం స్కూల్ పరీక్షా కేంద్రంలో 168 మందికి గాను 150 మంది, మొత్తం 382 మందికి 351 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో వివరించారు.

ముసునూరు: మండలంలో బుధవారం జరిగిన సోషల్ పరీక్షకు 52 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముసునూరు జడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 209 మందికి 199 మంది, గోపవరంలో 168 మందికి 151 మంది, చెక్కపల్లి కేంద్రంలో 261మంది విద్యార్థులకు గాను 236 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ జవహర్ బాజి తనిఖీ చేశారు. ఎస్ఐ వి.వాసు బందోబస్తు పర్యవేక్షించారు.

ముదినేపల్లి: చివరి రోజైన బుధవారం ముదినేపల్లి మండలంలో సోషల్ పరీక్షకు 74 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 722 మంది విద్యార్థులకు 648 మంది హాజర య్యారు. ముదినేపల్లి హైస్కూల్‌లో నలుగురు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడుగురు, సహాయ మాతా హైస్కూల్‌లో 33 మంది, ప్రైవేట్ విద్యార్థులు పెదగొన్నూరు జడ్పీ హైస్కూల్‌లో 25 మంది ప్రైవేట్, ఐదుగురు రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలను కైకలూరు ఎంఈవో రామారావు ఆధ్వర్యంలో స్క్వాడ్ తనిఖీ చేసింది. గురువారం మండలంలో సుమారు 80 మంది విద్యార్థులు సంస్కృతం పరీక్షలు రాయనున్నారు. ఎస్ఐ వెంకట్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కలిదిండి: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం సోషల్ పరీక్షకు 1053 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 84 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ ప్రియకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆక్రమణల వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఆగిరిపల్లి, మార్చి 27: ఆగిరిపల్లి మండలం సింగన్న గూడెం సాయిబాబా గుడి ఎదురుగా నూజివీడు - విజయవాడ రహదారి పక్కన ఉన్న విలువైన ఖాళీస్థలంలో ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ మృత్యుంజయరావు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించి, అక్కడ నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేయించారు. 'అధికారుల అండతో ఆక్రమణలు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన విషయం విదితమే. ఈవోపీఆర్డీ శేఖర్, నూగొండపల్లి పంచాయతీ కార్యదర్శి పుల్లారావు, వీఆర్వో రజని పాల్గొన్నారు.

బూత్‌లలో నిబంధనలు పాటించాలి : ఆర్వో



లింగాల పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్వో భాస్కర్, తహసీల్దార్ సుబాని

మండవల్లి, మార్చి 27: మండవల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్‌ను కైకలూరు రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్, మండవల్లి తహసీల్దార్ సుబాని బుధవారం పరిశీలించారు. గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో మంచి నీరు, ర్యాంప్, టాయిలెట్స్, విద్యుత్ తప్పని సరిగా ఉండాలని ఆర్వో భాస్కర్ ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ నిర్వహణలో బీఎల్వోలు నిబంధనలు విధిగా పాటించాలని ఆదేశించారు.

కోడ్ పక్కాగా అమలు చేయాలి : ఎంపీడీవో



చెక్కపల్లి సచివాలయంలో శిలాఫలకాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో పద్మావతీ దేవి

ముసునూరు, మార్చి 27: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఎంపీడీవో సీహెచ్.పద్మావతీదేవి ఆదేశించారు. బుధవారం చెక్కపల్లి, చింతలవల్లి, గుళ్ళపూడి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భవనాలపై శిలాఫలకాలను, గ్రామాల్లో కోడ్ అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని గ్రామస్థాయి అధికారులు అమలు చేయాలని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో రాజకీయ నాయకులు ప్రవర్తిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, సోషల్ మీడియాలో రాజకీయ పార్టీలకు అనుకూలంగా ప్రచారం చేసినా చర్యలు తప్పవన్నారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్వోలు పాయాస్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రద్దీ వేళల్లో భారీ వాహనాలు నడిపితే చర్యలు



భారీ వాహన డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మార్చి 27: ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయాల్లో భారీ వాహనాలను పట్టణంలోని ఇరుకు వీధుల్లో తీసుకురావడంపై నూజివీడు పట్టణ సీఐ ఎంవీఎస్ఎన్ మూర్తి బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రద్దీగా ఉండే సమయాల్లో బైపాస్‌లో వెళ్ళవలసిన వాహనాలు నూజివీడు పట్టణం మీదుగా వెళ్ళడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాహన చోదకులను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అధిక బరువుతో వాహనాలను తీసుకురావడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటంపై యజమానులకు హెచ్చరికలు జారీచేస్తూ మరోసారి ఈ విధంగా ప్రవర్తిస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, మార్చి 27: నూజివీడు పట్టణ పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సందర్భంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ శాఖ ఈఈ ఏ.సత్యనారాయణ తెలిపారు. నూజివీడు పట్టణంలోని ఏరియా ప్రభుత్వాసుపత్రి, నందనం తోట, గొడుగువారిగూడెం, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

ఆలయానికి జనరేటర్ వితరణ



ఆగిరిపల్లి, మార్చి 27: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు, హైదరాబాద్ వాస్తవ్యులైన గరికపాటి రమేష్, దేవుల పల్లి రామనాథ్, వలివేటి వెంకట సుబ్రహ్మణ్య శర్మ దంపతులు రూ.3 లక్షలు విలువైన జనరేటర్‌ను ఆలయానికి సమర్పించారని ఈవో డి.సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం శేషుబాబు, ఈవో దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిం మహిళలకు ప్రోటీన్ డబ్బాల పంపిణీ



కైకలూరు, మార్చి 27: రంజాన్‌లో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం మహిళలకు ప్రోటీన్ పౌడర్ డబ్బాలను పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ ప్రశాంతి తెలిపారు. బుధవారం కైకలూరు ఇస్లాంపేట కాల్వగట్టు ప్రాంతంలోని మహిళలకు ఈ డబ్బాల ను ఈమీన్స్ ఫౌండేషన్, లాస్య ఆసుపత్రి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ముగిసిన మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు



కలిదిండి, మార్చి 27 : మూల్లంకలో 13 రోజులుగా జరుగుతున్న పెద్దింటమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన జరిగింది. సర్పంచ్ మహాదేవ్ విజయ్, మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసీరావు, ఆలయ ఛైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, బోళ్ల ఏడుకొండలు, గణపతి, పితాని శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.